## 'ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి'

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 25 : కేజీబీవీ, మోడల్ స్కూల్ కాంట్రాక్టు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో డిప్యూటేషన్‌పై ప్రభుత్వ ఉపాధ్యాయులను పంపించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కామారెడ్డి జిల్లా శాఖ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవరెడ్డి, భూనేకర్ సంతోష్ బుధవారం తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడడం పద్ధతి కాదని హితువు పలికారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని సమ్మెలో పాల్గొంటున్న వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మైనర్లు వాహనం నడుపొద్దు

కామారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 25 : పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మైనర్ల డ్రైవింగ్‌పై పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోటర్ సైకిళ్లు నడుపుతూ పట్టుబడిన మైనర్లకు, వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపొద్దని, ఒక వేళ నడిపితే శిక్షార్హులు అవుతారని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మైనర్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన కొత్త ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ సూచించారు. బుధవారం ఎల్లారెడ్డిలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన వాహనదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ

పనులను ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి, కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ, డిసెంబర్ 25 : బాన్సువాడలోని 10వ వార్డు సాయికృప నగర్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ బుధవారం భూమిపూజ చేశారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు రూ.3 కోట్ల 5 లక్షలతో చేపట్టనున్న పనులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కాలనీవాసులు భాస్కర్‌రావు, నారాయణరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నాగన్న బావికి సందర్శకుల తాకిడి

లింగంపేట, డిసెంబర్ 25 : మండల కేంద్రంలోని నాగన్న బావికి సందర్శకుల తాకిడి పెరిగింది. బుధవారం సెలవు దినం కావడంతో నాగన్న బావి సందర్శనకు పర్యాటకులు తరలివచ్చారు. కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ నాగన్న బావిని సందర్శించి, బావి చరిత్రను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కామారెడ్డి పట్టణ కౌన్సిలర్ మమత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

## మున్నూరు కాపు యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక

నస్రుల్లాబాద్, డిసెంబర్ 25 : బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో బుధవారం మున్నూరు కాపు యూత్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్ణం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కొట్టి వెంకటి, కార్యదర్శిగా కర్క గణేశ్, కోశాధికారిగా కల్ల గంగాధర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా కొట్టి సునీల్, సహాయ కార్యదర్శిగా కొట్టి ఆకాశ్, సలహాదారులుగా పుల్లెని మహేశ్, కల్ల సాయికుమార్, సభ్యులుగా సాయిలు, సత్యం, వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు.

# సమస్యల వలయంలో సర్కారు దవాఖాన

- రోజూ వందల మంది రోగుల రాకతో కిక్కిరిస్తున్న కామారెడ్డి ఏరియా దవాఖాన
- వైద్యులు, వసతులు, ఏర్పాట్లు లేక తీవ్ర ఇబ్బందులు
- తాగునీరూ కరువే

స్థలం లేకపోవడంతో దవాఖాన బయట భోజనం చేస్తున్న రోగి బంధువులు

కామారెడ్డి, డిసెంబర్ 25 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖాన సమస్యల వలయంగా మారింది. దవాఖానకు ప్రతిరోజూ వందల మంది రోగులు వస్తుంటారు. రోగులకు సరైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నది. వైద్యులు, మందుల కొరత, దవాఖానలో స్కానింగ్ యంత్రాలు లేకపోవడం, దవాఖాన ఆవరణలో ఇష్టం వచ్చినట్లు వాహనాల పార్కింగ్, చివరికి తాగేందుకు తాగునీరు కూడా లేకపోవడంతో ఇక్కడికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన

### కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మెరుగైన వైద్యసేవలు..

పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దవాఖానలో కార్పొరేట్‌కు దీటుగా కోట్లాది రూపాయలతో సౌకర్యాలను కల్పించి, మెరుగైన వైద్యసేవలందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడంతో దవాఖాన సమస్యలతో దర్శనమిస్తున్నది. పేదలకు వైద్యం, మందులు అందించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతున్నది. కామారెడ్డి ఏరియా దవాఖాన జిల్లాకేంద్రంలోని చుట్టుపక్కల గ్రామాలకు మధ్యలో ఉండడంతో రోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. రోగులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు.

### ఇష్టం వచ్చినట్లు పార్కింగ్..

ఏరియా దవాఖానలో కనీసం పార్కింగ్ సౌకర్యం లేకపోవడం, దవాఖాన లోపలనే పార్కింగ్ చేయడంతో నిలబడేందుకు స్థలం లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దవాఖానలో వాహనాలను ఇష్టం వచ్చినట్లు పార్కింగ్ చేస్తున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే పార్కింగ్ చేస్తుండడంతో రోగులతోపాటు వారితో వచ్చే బంధువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దవాఖాన ఆవరణలో వృథాగా ఉన్న వాటర్ డబ్బా

### రాత్రి వేళ దవాఖానకు వస్తే అంతే సంగతి..

గర్భిణులు, రోగులు అత్యవసర పరిస్థితుల్లో రాత్రి వేళ దవాఖానకు వస్తే సరైన చికిత్స అందించకపోవడంతో దూరం నుంచి వచ్చిన రోగులు చాలా ఇబ్బంది పడుతున్నారు. గర్భిణులు చాలా మంది రాత్రి సమయాల్లో పురిటి నొప్పులతో దవాఖానకు వచ్చినా.. వారికి చికిత్స చేయలేని ఘటనలు చాలావరకు ఉన్నాయి. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రాత్రి వేళల్లో వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### మందుల కొరత ఉన్నది బయటికి రాస్తున్నాం..

దవాఖానలో మందుల కొరత ఉన్నవి మాత్రమే బయటికి రాస్తున్నాం. తాగునీరు సమస్య ఏమీ లేదు. ఏదైనా ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరిస్తాం. సమయానికి దవాఖానకు రాని వైద్యులను పరిశీలిస్తాం. ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకుంటాం.

**-డాక్టర్ ఫరీదా, దవాఖాన సూపరింటెండెంట్**

### మందుల కొరత.. రోగుల ఇబ్బందులు

ప్రైవేట్ దవాఖానలో ఇష్టం వచ్చినట్లు బిల్లులు వేస్తున్నారన్న భయంతో ప్రభుత్వ దవాఖానకు వస్తే సరైన వైద్యం అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో సామాన్య ప్రజలు ప్రభుత్వ దవాఖానకు రావాలంటేనే జంకుతున్నారు. దవాఖానలో రోగులకు రాసిన మందులు దొరకకపోవడంతో ప్రైవేట్ మెడికల్స్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. దవాఖానలో ఎంఆర్ఐ, సిటీ స్కాన్‌లు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి పరీక్షలు చేయించుకొని వస్తున్నారు. ప్రైవేట్ దవాఖాన వారు ఇదే అదనుగా డబ్బులను దండుకుంటున్నారు. ప్రభుత్వ దవాఖానలో కనీస సౌకర్యాలు కల్పించాలని, వైద్యుల కొరత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

### భోజనం తిందామంటే నీటి వసతి సరిగ్గా లేదు..

ప్రభుత్వ ఏరియా దవాఖానలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. తాగునీరు లేక బయట నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. దవాఖాన ఆవరణలో భోజనం చేసేందుకు తాగునీరు లేక, నీటి వసతి సరిగా ఇబ్బందులు పడుతున్నాం.

**-సావిత్రి, శివాయిపల్లి**

### సమయానికి వైద్యం అందడం లేదు..

చికిత్స కోసం ఉదయమే దవాఖానకు వచ్చాం. కానీ వైద్యులు సమయానికి రాక చికిత్స ఆలస్యంగా చేస్తున్నారు. ప్రైవేట్ దవాఖానలో చూపించుకోలేని పరిస్థితి ఉందని, సర్కారు దవాఖానకు వస్తే చికిత్స చేసేందుకు గంటలు గంటలు ఎదురుచూడాల్సి వస్తున్నది.

**-భిక్కనూర్ చిన్న కొండయ్య, ముత్యంపేట్**

### మందులు బయటికి రాసిస్తున్నారు.

చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఏరియా దవాఖానకు వచ్చాం. చికిత్స చేసిన అనంతరం మందులు అడిగితే బయటికి రాసి ఇచ్చారు. డబ్బులు లేక ప్రభుత్వ దవాఖానకు వస్తే మందులు లేవని చెప్పడంతో బయట కొనుగోలు చేశాం.

**- భూలక్ష్మి, లింగాపూర్**

దవాఖానలో పనిచేయని వాటర్ కూలర్

## గాంధారిలో సెంట్రల్ లైటింగ్ బల్బులకు మరమ్మతులు

సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

గాంధారి, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్ బల్బులు కొన్ని రోజులుగా వెలగక పోవడంతో, ఈ నెల 15న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'వెలుగని సెంట్రల్ లైటింగ్ బల్బులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ బల్బులకు మరమ్మతులు చేయించారు. కొన్ని రోజులుగా అంధకారంలో ఉన్న ప్రధాన రహదారిపై నూతన బల్బులు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నమస్తే తెలంగాణ దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

### పిట్లంలో రక్తదాన శిబిరం

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 25 : రక్త దానం చేయడంతో ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన వాళ్లమవుతామని అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ శాశ్వత అధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. పిట్లంలో అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జగదీశ్, దయాశ్‌రెడ్డి, భగవాన్, మాలధారులు నారాయణరెడ్డి, సంతోష్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడితోనే అటెండర్ గుండెపోటుతో మృతి.. ?

రామారెడ్డి, డిసెంబర్ 25 : డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో నోటీసులు పంపినందుకు మనస్సులో పెట్టుకొని విధి నిర్వహణలో ఒత్తిడి చేస్తూ.. సస్పెండ్ చేయిస్తామని, మెమో జారీ చేపిస్తామని భయభ్రాంతులకు గురి చేయడంతో అటెండర్ గుండె పోటుతో మరణించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బల్వీర్‌సింగ్(58) తొమ్మిదేండ్ల నుంచి అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కళాశాలలో పని చేస్తున్న కొందరు లెక్చరర్లు ఆర్థికంగా ఇబ్బందిలో ఉన్నప్పుడు బల్వీర్ సింగ్ డబ్బులు ఇచ్చేవాడు. అదే క్రమంలో ఓ లెక్చరర్‌కు డబ్బులు ఇచ్చి ఎంత అడిగినా ఇవ్వకపోవడంతో నోటీసులు పంపించాడు. దీంతో కొందరు అధ్యాపకులు కక్షగట్టి ఒత్తిడికి లోన్‌చేసి మెమోలు జారీ చేపిస్తామని, సస్పెండ్ చేయిస్తామని భయభ్రాంతులకు గురిచేసి ప్రార్థన సమయంలో అందరి ఎదుట మందలించడంతో తీవ్ర మనోవేదనకు గురై శనివారం రాత్రి నిద్రించాడు. ఆదివారం తెల్లవారే సరికి గుండెపోటుతో మరణించాడు. విచారణ చేపట్టి బాధితులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అనారోగ్యంతో అతని భార్య పూర్తిగా మంచానికే పరిమితమైందని, లెక్చరర్లకు ఇచ్చిన డబ్బులను తిరిగి ఇప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ విషయమై నోడల్ ఆఫీసర్ షేక్ సలాంను బుధవారం వివరణ కోరగా ప్రిన్సిపాల్‌ను వివరణ కోరానని, అలాంటి దేమీలేదని, అనారోగ్యంతోపాటు గుండెపోటుతో మరణించాడని తెలిపాడన్నారు. సెలవుల తర్వాత పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని నోడల్ ఆఫీసర్ తెలిపారు.

### భార్యను నరికి చంపిన భర్త

నిజాంసాగర్, డిసెంబర్ 25 : భార్యను కత్తితో నరికి చంపిన ఘటన బుధవారం మహ్మద్‌నగర్ మండలంలోని అవుసుల తండాలో చోటు చేసుకున్నది. ఎస్సై శివకుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అవుసుల తండాలో మెగావత్ మోతీబాయి (55)ను ఆమె భర్త షెర్యా నాయక్ కత్తితో మెడపై నరికి చంపాడు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

## గాయపడిన మున్సిపల్ కార్మికుడి మృతి

రామారెడ్డి, డిసెంబర్ 25 : రోడ్డు ప్రమాదంలో సోమవారం గాయపడిన మున్సిపల్ కార్మికుడు బుధవారం మృతి చెందాడని రామారెడ్డి ఎస్సై నరేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగంపేట్‌కు చెందిన పసుపు రేవన్‌కుమార్(25) కామారెడ్డి మున్సిపల్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం పని ముగించుకొని రంగంపేట్ వస్తుండగా గ్రామశివారులో అతి వేగంగా వెళ్తున్న ట్రాలీ ఆటో తన ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించగా, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి పసుపు బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### ఘనంగా వాజ్‌పాయ్ జయంతి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పాయ్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీలం చిన్న రాజులు, రంజిత్ మోహన్, రాంరెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పాల్వంచలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పోసు అనిల్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సత్యం, రాజేందర్, అశోక్ పాల్గొన్నారు. బీర్కూర్‌లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ జయంతిని నిర్వహించారు.

### నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 25 : నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. పిట్లం మండల కేంద్రంలో ఓ కిరాణ షాపులో బుధవారం రాత్రి పోలీసులు తనిఖీ చేయగా 2,35,560 రూపాయల విలువ గల గుట్కా ప్యాకెట్లు లభించడంతో సీజ్ చేసి దుకాణ దారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత గుట్కాలను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

### బిచ్కుంద ఏజీపీగా విఠల్‌రావు

బిచ్కుంద, డిసెంబర్ 25 : బిచ్కుంద మున్సిఫ్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా విఠల్‌రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావును బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విఠల్ రావును ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

### నవీపేట రైల్వేగేటు మూసివేత

నవీపేట, డిసెంబర్ 25: నవీపేటలో బాసర ప్రధాన రోడ్డుపై ఉన్న రైల్వే గేటు ఎల్‌సీ నంబర్ 188 మరమ్మతుల కారణంగా నేటి నుంచి ఐదు రోజులపాటు మూసివేస్తున్నట్లు ఉమ్రి రైల్వేశాఖ సీనియర్ ఇంజినీర్ సూరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు రైల్వే గేటు మూసి ఉంటుందన్నారు. నిజామాబాద్ – బాసర వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బాసర వైపు నుంచి నిజామాబాద్ వెళ్లేవారు కమలాపూర్, మహంతం, మోకన్‌పల్లి, గుండారం మీదుగా ప్రయాణించాలని తెలిపారు. బాసర వైపునకు వెళ్లేవారు కళ్యాపూర్, సాటాపూర్, తాడ్‌బిలోలి, ఫకీరాబాద్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుందని, ప్రయాణికులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

బాన్సువాడలో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

కందర్‌పల్లిలోని చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 25 : జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పాస్టర్లు క్రీస్తు పుట్టుక గురించి వివరించారు. కమిటీ సభ్యులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలోని సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. యేసుక్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకాలు అని అన్నారు.

పిట్లంలోని సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొని కేక్ కట్ చేశారు.

## కాలభైరవస్వామి ఆలయంలో జడ్జి పూజలు

జడ్జికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అర్చకులు

రామారెడ్డి, డిసెంబర్ 25 : రామారెడ్డి మండలం ఇసన్నపల్లి–రామారెడ్డిలో వెలసిన శ్రీ కాలభైరవస్వామిని జగిత్యాల జిల్లా జడ్జి నీలిమ కటుంబసభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, పూజారి వంశీశర్మ, ఆలయ సిబ్బంది యాదగిరి, భరత్, రవి తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధుడి మృతి

పోశయ్య(ఫైల్)

లింగంపేట, డిసెంబర్ 25: మండలంలోని పోల్కంపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు మంగళి పోశయ్య(105) అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పోశయ్య బుధవారం మృతి చెందాడు. రజాకార్ల పాలన, అరాచకాలను ప్రత్యక్షంగా చూసినట్లు, కరువు, కాటకాలను సైతం ఎదుర్కొన్నట్లు తెలిపేవాడు. మూడేండ్ల క్రితం పోశయ్య భార్య లింగమ్మ మృతి చెందింది. పోశయ్యకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు కలిపి 45 మంది సంతానం ఉన్నారు. బుధవారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## కామారెడ్డి రైల్వేస్టేషన్ నుంచి బాలిక అదృశ్యం

మహి

వినాయక్‌నగర్, డిసెంబర్ 25 : కామారెడ్డి పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి బాలిక అదృశ్యమైన ఘటన చోటు చేసుకున్నది. నాందెడ్ జిల్లా కిన్వాట్ తాలూకాకు చెందిన సిరిగొలే ఎర్రన్న.. హైదరాబాద్‌లోని లింగంపల్లి నుంచి తన అన్న కూతురు మహి (7)తో కలిసి కామారెడ్డికి పని ఈనెల 23న వచ్చాడు. హైదరాబాద్ తిరిగి వెళ్లేందుకు రాత్రి 9 గంటల ప్రాంతంలో కామారెడ్డి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. ట్రైన్ దొరకకపోవడంతో బుకింగ్ కౌంటర్ వద్ద పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు ఎర్రన్న లేచి చూడగా తన అన్న కూతురు మహి కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆచూకీ లభించకపోవడంతో ఎల్లంపేట్‌తోపాటు ఆర్య నగర్‌లో ఉండే వారి బంధువుల వద్దకు వెళ్లి తెలుసుకోగా ఆచూకీ దొరకలేదు. దీంతో మంగళవారం రాత్రి నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఫొటో ఆధారంగా బాలిక ఆచూకీ తెలిసిన వారు 8712658591 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.